

జిల్లాకు రెండు 108 వాహనాలు

వికారాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాకు నూతనంగా రెండు 108 వాహనాలు మంజూరయ్యాయి. జిల్లా వైద్యాధికారి వెంకట రవణ వాహనాలను ప్రారంభించారు. శనివారం వాహనాలకు పూజలు చేసిన అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ పీహెచ్‌సీలకు కేటాయించినట్లు తెలిపారు.

పరిగి అభివృద్ధికి నిధులు కేటాయించండి



రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. పరిగిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో నాలుగు లేన్లు, డబల్ రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దాంతో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, నిధులు ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ తెలిపారు.

రాష్ట్రపతి ముర్ముకు ఘన వీడ్కోలు

- హకీంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరిన ప్రెసిడెంట్
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, సీఎస్, కలెక్టర్ సెండాఫ్

7

గోవా మద్యం పట్టివేత

- న్యూఇయర్ వేడుకలకు తరలిస్తుండగా సీజ్
- రూ.లక్ష విలువైన 95 బాటిళ్ల స్వాధీనం

7

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి

డీఆర్‌డీవో శ్రీనివాస్

7

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు

- 1995 -గాజుల బస్వరాజ్
- 2000 - ఎన్.జనార్దన్
- 2006 - రాంచందర్
- 2013 - పి.శివకుమార్
- 2016 - గోవింద్‌రావు



రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు అందుకుంటున్న గోవిందరావు (ఫైల్)

వెల్‌డన్ సార్

అజ్ఞానాంధకారాన్ని తొలగించి విజ్ఞాన వీచికలు విరజిమ్మిన మార్గనిర్దేశకులు వారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే తపన, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలన్న లక్ష్యంతో ముందుకు సాగేవారు ఆ గురువులు. అలాంటి ఉన్నతమైన ఉపాధ్యాయులను ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఐదు జాతీయ అవార్డులు వరించాయి. తాండూరు నియోజకవర్గంలో 1995- 2016 వరకు ఐదుగురు ఉపాధ్యాయులకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకునే అదృష్టం దక్కింది. ప్రధానంగా పెద్దేముల్ మండలంలో పనిచేసిన నలుగురు ఉపాధ్యాయులకు ఈ అవకాశం వచ్చింది. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.

తాండూరు టీచర్లకు అరుదైన గౌరవం

- 20 ఏళ్లలో ఐదుగురికి జాతీయ అవార్డులు
- 'పెద్దేముల్'లో పనిచేసిన నలుగురికి గుర్తింపు
- ఒక్కొక్కరు ఒక్కో రంగంలో విశేష సేవలు



రాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ నుంచి అవార్డు అందుకుంటున్న గాజుల బస్వరాజ్(ఫైల్)

తాండూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతం నుంచి మొట్ట మొదటి సారిగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఉపాధ్యాయుడు గాజుల బస్వరాజ్ అందుకున్నారు. ఆయన 1995లో అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుని తాండూరు పేరును దేశ రాజధానిలో వినిపించారు. ఆ సమయంలో ప్రాథమిక స్థాయి వరకు ఉన్న ఇందూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అనంతరం పాఠశాలను అంచలంచెలుగా అభివృద్ధి చేస్తూ ఉన్నత పాఠశాలలుగా

- మిగతా 7వ పేజీలో...

అన్ని కోర్టులూ ఒకేచోట

హైకోర్టు జడ్జి అభినందన్ కుమార్ షావలి

మేడ్చల్ కోర్టు ఆవరణలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ షావలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని కోర్టులన్నీ ఒకేచోట ఏర్పాటుచేసేందుకు అదనంగా భవనాన్ని నిర్మిస్తున్నామని హైకోర్టు న్యాయమూర్తి అభినందన్ కుమార్ షావలి తెలిపారు. రూ.90లక్షల నిధులతో మేడ్చల్ కోర్టు ఆవరణలో నిర్మిస్తున్న భవన నిర్మాణపు పనులకు ఆయన శనివారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ న్యాయం కోసం కోర్టుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల కోర్టులు ఒకే ప్రాంగణంలో ఉంటే.. న్యాయవాదులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం అత్వెల్లిలో నిర్వహిస్తున్న రెండు కోర్టులను మేడ్చల్ పట్టణంలోని ఇతర కోర్టుల ప్రాంగణంలోకి తీసుకురావటానికి నూతన భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయాధి కారి బాలభాస్కర్‌రావు, సెకండ్ డిస్ట్రిక్ట్ అడిషనల్ కోర్టు న్యాయాధికారి జీవన్ కుమార్, అడిషనల్ సీనియర్ న్యాయాధికారి అజయ్‌కుమార్, ఫస్ట్ జూనియర్ న్యాయాధికారి లావణ్య, సెకండ్ జూనియర్ న్యాయాధికారి దిలీప్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమలత, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

దౌల్తాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, సైబర్ నేరాల పట్ల కళాజాత బృందాలతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శనివారం తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. దౌల్తాబాద్ మండలంలో ప్రస్తుతం నేరాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై గ్రామాల్లో కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేషన్





మాట్లాడుతున్న వెంకటేషన్, హాజరైన సఫాయి కర్మచారిలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా సఫాయి కర్మచారిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అంతరంగిక కమిటీలను ఏర్పాటుచేసి వేధింపులు, తదితర సమస్యలుంటే తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి హాజరైన వెంకటేషన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారిలు ఏమైనా సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలని, పరిష్కారం కాకుంటే యూనియన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అక్కడ కూడా పరిష్కారం కాకుంటే హెల్ప్‌లైన్ నెంబర్ 01124648924 ద్వారా కమిషన్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. ప్రతీ మున్సిపాలిటీకి చెందిన సఫాయి కర్మచారిలను వేదిక వద్దకు పిలిచి.. జీతం సరిగ్గా వస్తుందా? ఏమైనా కోతలు విధిస్తున్నారా? అని అడిగారు. అనంతరం వారి ఫోన్లలో జీతం పడిన తేదీలను పరిశీలించారు. కొంతమందికి తక్కువ జీతం పడటంతో మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సఫాయి కర్మచారిలకు యూనిఫాం, ఐడీ కార్డులు, నెలలో నాలుగు రోజుల సెలవులు వంటి విషయాలతో పాటు వారి హక్కులను తెలియజేయాలని చైర్మన్ సూచించారు. నెలకోసారి వారిని కలిసి సమస్యలు తెలుసుకోవాలని లేబర్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్‌కుమార్ తదితరులున్నారు.

ధీర 'నారీమణులు'..

- భర్త చనిపోయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు
- కుటుంబాలను పోషిస్తూ పలువురికి ఆదర్శం
- 20 ఏళ్ల కింద వలస వచ్చి ఇక్కడే జీవనం
- వలస కార్మికుల విషాదగాథ..

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఉపాధి కోసం వేలాది కిలోమీటర్లు వలస వచ్చి.. పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు కార్మికులు విగతజీవులుగా మారారు. ప్రమాదాల్లో జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళలు తిరిగి తమ స్వరాష్ట్రాలకు వెళ్లకుండా మొక్కవోని ధైర్యంతో ఇక్కడే ఉంటూ.. కార్మికులుగా మారి కుటుంబాలను పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కొత్తూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి)

7



పిల్లలకు వంటచేసి పెడుతున్న తల్లి రేణుకుమారి

ధ్యాన సంద్రం

అట్టహాసంగా ధ్యాన మహాయాగం వేడుకలు ప్రారంభం

- మహేశ్వర మహాపిరమిడ్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభ్యాసకులు
- పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డితో కలిసి వేడుకలను ప్రారంభించిన ఎంపీ మల్లు రవి
- హాజరైన కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు
- అలరించిన కళాకారుల నృత్య రూపకాలు
- పత్రీజీ చైతన్య జ్యోతి ర్యాలీకి ఘన స్వాగతం



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

కడ్తాల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన సంద్రంగా మారింది. పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలు శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11రోజుల పాటు పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు జరుగనున్నాయి. మొదటి రోజు పెద్ద సంఖ్యలో అభ్యాసకులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, మహిళలు తరలివచ్చి సరస్వతి ప్రాంగణంలో ధ్యానం చేశారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతుళ్లు పరిణత పత్రీజీ, పరిమళ పత్రీజీలతో కలిసి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి వేడుకలను

- మిగతా 6వ పేజీలో...



పిరమిడ్ ఆవరణలో ధ్యానం చేస్తున్న యువతి



వేడుకల్లో పాల్గొన్న ధ్యానులు

బాగా చదివి గ్రామానికి పేరు తేవాలి

యాచారం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని పీఆర్టీయూ-టీఎస్ పత్రిక సంపాదకులు బి.జగన్‌మోహన్‌గుప్తా అన్నారు. విద్యార్థులు ఆహార పదార్థాలు తయారుచేయడం అభినందనీయమన్నారు. చదువుల్లో, ఆటల్లో, వంటకాల్లో రాణించాలని సూచించారు. శనివారం ఫుడ్‌ఫెస్టివల్ సందర్భంగా బాలికలు వివిధ ఆహార పదార్థాలను చేసి ప్రదర్శించారు. కుర్మిద్ద హైస్కూల్ విద్యార్థినులు సైతం రక రకాల ఆహార పదార్థాలను చేసి తోటి విద్యార్థులకు పంపిణీ చేశారు. గడ్డమల్లయ్యగూడ స్కూల్ విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ ఐటంలు అందజేశారు. జంక్ ఫుడ్ తినొద్దని సూచించారు. ఆయా స్కూళ్ల హెచ్ఎంలు జి.సంజీవ్, సత్తు పాండురంగారెడ్డి, టీచర్లు రోహిణి, లత, పావని, రమాదేవి, శ్రీనివాస్, వీరమణి, స్వప్న, అశోక్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేస్తున్న జగన్‌మోహన్‌గుప్తా

ధ్యాన సంద్రం

5వ పేజీ తరువాయి..

ప్రారంభించారు. కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పత్రీజీ జయంతిని పురస్కరించుకొని నవంబరు11న ప్రారంభమైన పత్రీజీ చైతన్య జ్యోతి ర్యాలీ పిరమిడ్‌లోని పత్రిజీ శక్తిస్థల్‌కు చేరుకోగా ఘనస్వాగతం పలికారు. శక్తిస్థల్‌ను ధ్యానులు, సందర్శకులు సందర్శించి ప్రతిజీకి నివాళులర్పించారు. నిర్వాహకులు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. ధ్యాన దినోత్సవ వేడుకల నేపథ్యంలో పత్రిజీ కుమార్తెలు కేక్ కట్‌చేశారు. అనంతరం సామూహిక ధ్యాన సాధనలో లీనులయ్యారు.

భారతీయుల ధ్యాన మార్గం ప్రపంచానికే ఆదర్శనీయమని ఎంపీ మల్లు రవి అన్నారు. ధ్యానం ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. పత్రీజీ చేపట్టిన ధ్యాన, శాఖాహార జగత్తు లక్ష్యాల సంకల్పం విజయవంతానికి అభ్యాసకులు, పిరమిడ్ మాస్టర్లు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వర మహాపిరమిడ్ ఏర్పాటుతో కడ్తాల ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందన్నారు. కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ధ్యానం, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. పత్రిజీ చూపిన ధ్యాన మార్గం ప్రపంచ మానవాళికి అనుసరణీయమని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. పత్రిజీ ఆశయ సాధనే ధ్యేయంగా పిరమిడ్ ట్రస్ట్ ముందుకు సాగుతుందన్నారు. 2028లో మహేశ్వర మహా పిరమిడ్‌లో ప్రపంచ మహిళా ధ్యాన మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.



వేడుకల్లో మాట్లాడుతున్న కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రధాని నరేంద్రమోదీని మహాసభలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పత్రీజీ కూతుళ్ల పరిణతి, పరిమళ పత్రిజీలు మాట్లాడుతూ ప్రతీ పిరమిడ్ మాస్టర్ ఒక పత్రీజీ కావాలని, సమాజాన్ని ధ్యాన, జ్ఞాన, ఆధ్యాత్మిక మార్గం వైపు తీసుకుపోవాలన్నారు. డిసెంబరు 21వ తేదీని వరల్డ్ మెడిటేషన్ డేగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించడం భారత ధ్యాన విప్లవాన్ని విశ్వవ్యాప్తం చేసిన పత్రిజీ కృషి ఫలితమేనన్నారు. కాగా, ఎంపీలు మల్లు రవి, నాగరాజులు పత్రిజీ ఆశయం మేరకు ఏపీలోని కర్నూల్ జిల్లా జగన్నాథ గుట్టపై ధ్యాన మహాకేంద్రం ఏర్పాటుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో కృషి చేస్తామని చెప్పారు.

వేడుకలకు కిషన్‌రెడ్డికి ఆహ్వానం

ధ్యాన వేడుకలకు హాజరుకావాలని కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయ భాస్కర్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, హన్మంతరావు, మాధవి, లక్ష్మి, జ్యోతి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, దశరథనాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.





కచేరి నిర్వహిస్తున్న మహిళా కళాకారులు, ధ్యానం చేస్తున్న ఫైట్ మాస్టర్ రామ్

కాంట్రాక్టు ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



ఎన్టీఆర్ చౌరస్తాలో బైఠాయించి ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

వికారాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఏఎన్ఎంల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అసెంబ్లీలో చర్చించి జీవో ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంలు హక్కులు అడిగితే అరెస్టులు చేయడమేంటని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు లీలావతి, ఏఎన్ఎంలు వెంకటమ్మ, భారతి, సుహాసిని, మంజుల, స్రవంతి, రజియా, పద్మ, సల్మా, సుజాత, స్వరూప, చంద్రకళ, రాములమ్మ, తిరుపతయ్య, అనిత, యాదమ్మ, మల్లమ్మ, హంస, రోజా, భారతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆంజనేయస్వామి పల్లకీ సేవను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. షాబాద్ మండలం తిరుమలాపురానికి చెందిన కె.శ్రీనివాస్-లావణ్య దంపతులు అన్నదానానికి 5వేల రూపాయలిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, కౌన్సిలర్ పి.లతశ్రీశ్రీశైలంగౌడ్, ఇ.శ్రీనివాస్, గూదె వసంతరావు, జి.రమేష్, అశోక్‌గౌడ్, బాల్‌రెడ్డి, రమేష్, జి.సతీష్, రఘుగౌడ్, రమేష్, ఎం.అశోక్, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కార్పొరేషన్ నిధులివ్వాలి



చైర్‌పర్సన్ సుజాతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేష్

ఆమనగల్లు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేద ఆర్య వైశ్యుల సంక్షేమానికి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి సాయమందించాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతను డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రామకృష్ణలతో సుజాతను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ కార్పొరేషన్ ద్వారా పేద కులస్థులకు చేయూతనివ్వాలని కోరారు. గ్రామాల్లో ఆర్యవైశ్యులు చిన్నచిన్న కిరాణ దుకాణాలతో ఉపాధి పొందుతున్నారని, కార్పొరేషన్ రుణాలిచ్చి చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వాలని కోరినట్టు వెంకటేష్ తెలిపారు. అలాగే ఇతర సమస్యల పరిష్కారానికీ చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి



హస్నాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

కొడంగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని హస్నాబాద్‌లో శనివారం నర్సరీని, మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో కొడంగల్, దౌల్తాబాద్ మండలాల క్షేత్రసహాయకులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఏపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి ప్రతీ గ్రామపంచాయతీలో ఉపాధిహామీ కింద పనులను ప్రారంభించాలని సూచించారు. ఫాంపాండ్స్, షిప్‌పాండ్స్, నాడేపు కంపోస్టు, పీట్స్ వర్మీ కంపోస్టు పిట్స్, అజోల్ల పిట్స్, పశువుల షెడ్లు, గొర్రెలు, మేకల షెడ్లకు ప్రాముఖ్యత కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళకుమారి, ఎంపీడీవో ఉషశ్రీ, దౌల్తాబాద్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో జైపాల్ రెడ్డి, ఏపీవో రాములు పాల్గొన్నారు.


స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వరుస స్కూలు బస్సు ప్రమాదాలకు కారకం అవుతున్న సిల్వర్ డైల్ స్కూల్ యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీవో చంద్రకళ, ఎంఈవో పురందాస్‌లకు వినతిపత్రం అందించారు. నాయకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. చన్వెల్లిలో గల సిల్వర్ డెయిల్ స్కూల్ బస్సు ప్రమాదంలో త్రుటిలో విద్యార్థులకు ప్రాణగండం తప్పిందన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం, లైసెన్స్ లేని వారితో బస్‌లు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మూడు ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పెను ముప్పు జరగకముందే ఉన్నతాధికారులు సిల్వర్ డైయిల్ స్కూల్ యాజమన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో విచారణ



అంగన్‌వాడీ కేంద్రంలో విచారిస్తున్న సీడీపీవో వెంకటేశ్వరమ్మ

నవాబుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగ్యాడలో వ్యక్తి చనిపోయి దినవారం కాలేదని అంగన్‌వాడీకి హాజరైన చిన్నారిని టీచర్ బయటకు పంపించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై శనివారం ప్రచురితమైన కథనానికి సీడీపీవో వెంకటేశ్వరమ్మ స్పందించారు. శనివారం గంగ్యాడ గ్రామానికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరమ్మను హెచ్చరించి మెమో జారీచేశారు. అదేవిధంగా విద్యార్థి సాన్విక తండ్రి ఉపేందర్‌రెడ్డి, గ్రామస్థులతో ఆమె మాట్లాడారు.

ధీర నారీమణులు..

- భర్త చనిపోయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు
- కుటుంబాలను పోషిస్తూ పలువురికి ఆదర్శం
- 20 ఏళ్ల కింద వలస వచ్చి ఇక్కడే జీవనం
- వలస కార్మికుల విషాదగాథ..



మితిలేష్‌కుమార్ కుటుంబం (పాత చిత్రం)

కొత్తూర్, డిసెంబరు 21: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 1976లో అప్పటి ప్రభుత్వం కొత్తూర్ వద్ద పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. దాంతో ఆ ప్రాంతంలో వందలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు కొత్తూర్‌కు వలస వచ్చి ఆయా పరిశ్రమల్లో ఉపాధి పొందుతూ అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

మృత్యు వాతపడుతున్న కార్మికులు

కొత్తూర్ పారిశ్రామిక వాడ ఏర్పడినప్పటి నుంచి పలు పరిశ్రమల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2020లో బిహార్‌కు చెందిన రాంగణిత్ యాదవ్(40) ఆనంద్ స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మహాలక్ష్మీ టెక్స్‌టైల్ పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన మితిలేష్‌కుమార్(42) ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఇలా అనేకమంది పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి మృత్యువాత పడ్డ సంఘటనలు కోకొల్లలు. ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల మృతదేహాలను స్థోమత ఉన్న కుటుంబసభ్యులు వారి వారి ప్రాంతాలకు తరలించి అక్కడ అంత్యక్రియలు చేసుకోగా, స్థోమత లేని వారు ఇక్కడే అంత్యక్రియలు జరిపించుకున్నారు. మృతి చెందిన పలువురు కార్మికుల భార్యలు తమ రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉంటుండగా, కొందరు వారి వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్న కార్మికుల కుటుంబాలు ఆయా పరిశ్రమల్లో మళ్లీ కార్మికులుగా చేరి పిల్లలను పోషిస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిపిస్తున్నారు. గత 20 ఏళ్లుగా పిల్లలను పోషిస్తూ కటుంబాన్ని ముందుకు నడిపిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

నామమాత్రపు నష్టపరిహారం

పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడుతున్న కార్మికుల కుటుంబాలకు పరిశ్రమల యాజమానులు నామమాత్రపు నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో కార్మికుల కుటుంబాలు చేసేది లేక చాలీచాలనీ జీతాలతో జీవితాలు గుడుపుతుంటారు. 20 ఏళ్ల క్రితం కొత్తూర్‌కు వలస వచ్చిన కార్మికులు ఇక్కడి ప్రజలతో పూర్తిగా కలిసిపోయారు. తెలుగు భాషా నేర్చుకుని ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు సంస్కృతి పండుగల్లోనూ పాలుపంచుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



20 సంవత్సరాల క్రితం కొత్తూర్‌కు వలస వచ్చాం. నాభర్త రాంగణిత్ యాదవ్ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి కుటుంబ భారాన్ని నేనే మోస్తున్నాను. బిస్కట్ పరిశ్రమలో దినసరి కార్మికురాలిగా పనిచేస్తూ అద్దె ఇంట్లో జీవనం కొనసాగిస్తున్నా ను. తక్కువ వేతనం వస్తుంది. నాకు ముగ్గురు కుమార్తెలు. వారిని ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాను. పై చదువుల కోసం హైదరాబాద్ వెళ్లి వస్తున్నారు. తన భర్తకు సంబంధించి నామమాత్రం నష్ట పరిహారం అందింది. ఇక్కడ ప్రజలు తమను ఎంతో ఆదారిస్తున్నారు. ప్రభుత్వం మాలాంటి వారిని ఆదుకోవాలి.

- పింకాదేవి, భర్తను కోల్పోయిన మహిళ

20 ఏళ్లుగా ఇక్కడే జీవనం



20 సంవత్సరాల క్రితం కొత్తూర్‌కు వలస వచ్చాం. మదనపల్లి వద్ద గల మహాలక్ష్మీ టెక్స్‌టైల్ పరిశ్రమల్లో నా భర్త మితిలేష్‌కుమార్(42) కార్మికునిగా పనిచేశాడు. ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మాకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముగ్గురు ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. తన భర్త తండ్రి శ్యామ్ బిహారిసా కూడ ఇక్కడే ఉంటున్నాడు. 5 మంది కుటుంబ సభ్యులను నేనే పోషిస్తున్నాను. చాలీచాలనీ వేతనంతో బిస్కట్ పరిశ్రమల్లో కార్మికురాలిగా పనిచేస్తున్నాను. ఇక్కడ ప్రజలు తమను ఎంతో మంచిగా చూసుకుంటున్నారు. మేము కొత్తూర్‌లోనే ఉండిపోతాం. ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- రేనాకుమారి, భర్తను కోల్పోయిన భార్య



పట్టుబడిన మద్యం

గోవా మద్యం పట్టివేత

వికారాబాద్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకలకు రైలులో తరలిస్తున్న గోవా మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. గోవా మద్యం బాటిళ్లను వాస్కోడిగామా రైలులో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలులో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, ఎక్సైజ్ ఎస్ఐలు ప్రేమ్‌రెడ్డి, వీరాంజనేయులు, సిబ్బంది రైలులో తనిఖీలు చేపట్టారు. 4 బోగీల్లో దాడులు నిర్వహించి రూ.లక్ష విలువైన 95గోవామద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన యువకులు మద్యం తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్ అభినందించారు.

రైతులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

కొడంగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాయిపల్లి గ్రామశివారులో సర్వే నెంబర్ 19లో మెడికల్, వెటర్నరీ కళాశాలల కోసం ప్రభుత్వం రైతుల నుంచి భూములు సేకరించింది. భూములు ఇచ్చిన రైతులకు శనివారం కొడంగల్ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రైతులకు 125గజాల చొప్పున లేఅవుట్ చేసిన ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ అందించారు.

రాష్ట్రపతి ముర్ముకు ఘన వీడ్కోలు

హకీంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరిన ప్రెసిడెంట్

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : శీతాకాల విడిదిని ముగించుకొని తిరిగి ఢిల్లీకి బయలుదేరిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శనివారం హకీంపేట విమానాశ్రయమంలో ఘన స్వాగతం లభించింది. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేణుగోపాల్‌రావు, కలెక్టర్ గౌతమ్‌లు ఘనంగా వీడ్కోలు పలికారు. కాగా, ఈ నెల 17న హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ఐదు రోజుల పర్యటనను ముగించుకొని తిరిగి ఢిల్లీకి పయణమయ్యారు.

రాష్ట్రపతి పర్యటన విజయవంతంలో అధికారుల పాత్ర అభినందనీయం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ గౌతమ్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన విజయవంతం చేయడంలో జిల్లాస్థాయిలో అన్ని శాఖల అధికారుల పాత్ర అభినందనీయమని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రాష్ట్రపతి శీతాకాల విడిది శనివారంతో ముగియడంతో ఆమె ఢిల్లీకి బయల్దేరిన అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు రాష్ట్రపతి పర్యటనలో అధికారులు సమన్వయంతో ముందుకుసాగారని, వారికి అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, సమాచార, రహదారులు, విద్యుత్తు, అటవీ, ఆరోగ్య, సివిల్ సప్లయ్, అగ్నిమాపక శాఖతో పాటు అన్నిశాఖల అధికారులు కలిసికట్టుగా చేయడం వల్లనే రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగిసిందన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ గౌతమ్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

అట్టహాసంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



బాలికలతో కరచాలనం చేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, రవీందర్ గౌడ్

తాండూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 క్రీడాపోటీల్లో భాగంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. తాండూరు పట్టణంలోని చించోళి రోడ్డు మార్గంలో ఉన్న సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పోటీలను ప్రారంభించారు. ఆమెతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో అండర్-18 బాలుర విభాగంలో 20 జట్లు, బాలికల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. రూరల్ సీఐ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని



పుష్పలత

తాండూరు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తాండూరు మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని పుష్పలత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమేరకు ప్రిన్సిపాల్ శ్రీదేవి, పీఈటీ యాదగిరిలు పుష్పలతను అభినందించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



స్టాల్‌ను పరిశీలిస్తున్న తాండూరు ప్రాంత రైతులు

తాండూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వజ్రోత్సవ వేడుకలతో పాటు కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు మండలంలోని బెల్కటూర్, అంతారం, మిట్టబాస్పల్లి, తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన 30మంది రైతులు హాజరయ్యారు. ఇందులో నూతన వంగడాలు, నూతన టెక్నాలజీ, వివిధ పనిముట్లు, సాంకేతిక విధానంతో వ్యవసాయం, రసాయనిక మందుల వాడకంపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఇందులో భాగంగా రైతులు కిసాన్ మేళాలో వివిధ పనిముట్లతో నూతన వంగడాల ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏవో కొమరయ్య ఏఈవో శ్రీనివాస్, రైతులు నారాయణరెడ్డి, సుభాన్‌రెడ్డి, ఎల్లప్ప పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు గోపాల్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగా నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌ను దేశచరిత్రలో ఎక్కువసార్లు అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేసేలా ఆ పార్టీ ఒత్తిడి తెస్తోందని ధ్వజమెత్తారు. శనివారం చిలుకూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో సొంత కుటుంబీకులకు భారతరత్న గౌరవాన్ని ఇచ్చుకొని అంబేడ్కర్‌ను విస్మరించిందన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టకుండా అడ్డుకుందన్నారు. తోలుకట్టలో హనుమాన్ ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసినా కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు ఉన్నారు.

రవాణా శాఖలో పదోన్నతులు, బాధ్యతలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. పదోన్నతులు పొందిన గ్రేటర్‌లోని పలువురు అధికారులకు పోస్టింగ్‌లిస్తూ శనివారం రవాణా శాఖ ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌కు విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్, ఐటీ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) బాధ్యతలు అప్పగించారు. నాగోల్ ఆర్టీవో రవీందర్‌కుమార్‌కు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ)గా ప్రమోషన్ లభించిన నేపథ్యంలో ఆయనను ఆదిలాబాద్ డీటీసీగా, ఉప్పల్ ఆర్‌టీఓ ఎస్.వాణికి నల్గొండ డీటీసీగా పోస్టింగిచ్చారు. ఖాళీ అయిన ఉప్పల్, నాగోల్ స్థానాల్లో ఆర్‌టీఓలకు సంబంధించి నేడు ఉత్తర్వులు వస్తాయని రవాణా శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

కాంగ్రెస్ పాలనలో విప్లవాత్మక మార్పులు

మంచాల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏడాదిలోనే విప్లవాత్మక మార్పులొచ్చాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మంచాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తూ విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. రైతులకు పంటరుణ మాఫీచేసి గొప్ప నేత అని అన్నారు. ఇప్పటికే 50వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారని చెప్పారు. కొన్ని రోజుల్లోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదలవబోతోందన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు సాతిరి ఎల్లేష్, వీరేష్‌గౌడ్, రమాకాంత్‌రెడ్డి, జంగయ్యయాదవ్, నరేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సురేష్, చంద్రయ్య, సతీష్ పాల్గొన్నారు.

వెల్‌డన్ సార్

(5వ పేజీ తరువాయి)

మార్పులు చేయించారు. దీంతో ఎందరో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత చదువును దగ్గర చేశారు. అంతేకాకుండా పూర్తిగా గిరిజన ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో సామాజిక చైతన్యాన్ని కూడా తీసుకొచ్చారు. తదనంతర కాలంలో ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగులుగా ఎదిగారు. ఉపాధ్యాయ వృత్తే కాదు సాహితీ, సామాజిక, ఆధ్యాత్మిక కళారంగాల్లో బస్వరాజ్ విశేష సేవలందించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులుగా ఇప్పటికీ ఆయన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పెద్దేముల్ మండల ఇందూర్‌లో ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయలుగా పని చేస్తున్న సమయంలో ఈ అవార్డును అందుకున్నారు.

గజ్జకట్టి.. పిల్లలతో జతకట్టి

2016 సెప్టెంబరు 5న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా గోవింద్‌రావు జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కందనెల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సమయంలో ఆయనను ఈ అవార్డు వరించింది. గజ్జకట్టి.. పిల్లలతో జతకట్టి.. ఆటలాడి.. పిల్లల్ని బడికి రప్పించేలా చేయడంలో గోవింద్‌రావుది అందెవేసిన చెయ్యి. వృత్తి ధర్మంగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూనే సామాజిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ప్రధానోపాధ్యాయుడి పాత్ర పోషిస్తూనే ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలు బోధిస్తారు. అక్షర సాధన, బాల కార్మికుల వ్యవస్థ, మూఢ నమ్మకాలు తదితర సామాజిక రుగ్మతలపై తన కళానైపుణ్యంతో నాటక ప్రదర్శన ఇచ్చి వాటిని పారదోలేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయం.

జానపదమే జీవన విధానం



రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ నుంచి అవార్డును అందుకుంటున్న ఎన్.జనార్దన్(ఫైల్)

జానపదమే ఆయన జీవన విధానం. పల్లె పాటలతో ప్రజల్ని ఆకట్టుకున్నారు. పాఠశాలలో పాఠాలు బోధిస్తూనే బాల కార్మిక విముక్తికి నిరంతరం కృషి చేశారు. అక్షరాస్యత కార్యక్రమాల్లో ఊరూర తిరుగుతూ పల్లెపాటలతో జనాన్ని జాగృత పరిచారు. జానపద శైలిలో ఆయన పాడిన పాటకు ప్రజలు ఆకర్షితులై రాత్రిబడుల్లో చదువు నేర్చుకునేలా చేసింది. సాహితీ, కళారంగాల్లో తన కంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు. తాండూరులో ఏ కార్యక్రమం జరిగినా ఆయన తన వాగ్దాటితో వ్యాఖ్యతగా వ్యవహరించేవారు. 2000 సంవత్సరంలో తాండూరు మండలం గౌతాపూర్ పాఠశాలలో హెచ్ఎంగా కొనసాగుతున్న సమయంలో ఆయన జాతీయ అవార్డును అందుకున్నారు. అప్పటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ నుంచి ఆయన అవార్డును అందుకున్నారు.

బోధనే కాదు సర్వీసు విషయంలోనూ..



రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అవార్డును అందుకుంటున్న రాంచందర్(ఫైల్)

బోధనతోపాటు సర్వీసు విషయాల్లోనూ తోటి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా రాంచందర్ కృషి చేసేవాడు. సావధానంగా సమస్యలను పరిష్కరించి, లక్ష్యాలను సాధించడంలో ఆయనకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరుంది. పెద్దేముల్ మండలం మంసాన్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సమయంలో ఆయనను జాతీయ స్థాయి అవార్డు వరించింది. 2006లో ఆనాటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. పాఠంపై పూర్తి ఏకాగ్రతను నిలిపి బోధిస్తేనే విద్యార్థుల మనస్సుల్లో విషయ పరిజ్ఞానం నాటుకుపోతుందని తనదైన బోధనతో రాంచందర్ నిరూపించారు. ఆయన వందలాది మంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారు.

యోగా సాధకుడికి ప్రత్యేక గుర్తింపు



రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి అవార్డును అందుకుంటున్న శివకుమార్(ఫైల్)

శివకుమార్ యోగ సాధనలో దిట్ట. పిల్లలు బడికి రాకపోతే ఏం చేయాలని ఆలోచించేవారు. తగ్గుతున్న విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అనేక వినూత్నమైన చర్యలు చేపట్టేవారు. బిస్కెట్స్ డే, ఫ్రూట్స్ డేల పేరుతో అందరినీ బడిబాట పట్టేలా చేసేవారు. మొట్ట మొదటిసారిగా విద్యార్థులకు క్రమ శిక్షణ నేర్పేందుకు ఉద్దేశించిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ప్రవేశపెట్టడంలో నియోజకవర్గంలోనే శివకుమార్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. పాఠాలు బోధిస్తూనే నాటకాల ద్వారా ప్రజా చైతన్యానికి నిరంతరం కృషి చేశారు. యోగా శిక్షకుడిగా 40వేలకు పైగా ఔత్సాహికులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. 2013లో పెద్దేముల్ మండల అడ్కిచర్ల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన సమయంలో ఆయన జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగాఅందుకున్నారు.

అటవీ భూముల ఆక్రమణకు యత్నం


అక్రమార్కులు నిప్పంటించిన చెట్ల కొమ్మలు

ధారూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అడవిలోని చెట్లను నరికి నిప్పుపెట్టి అటవీ భూమిని ఆక్రమించేందుకు ఆక్రమార్కుల చేసిన ప్రయత్నాన్ని అటవీ సిబ్బంది నిలువరించారు. ఈ ఘటన ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. అటవీ రేంజర్ రాజేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన కావలి శ్రీను, కుమ్మరిపల్లి మొగులయ్యలు రాస్నం అటవీ ప్రాంతంలో అక్రమంగా చొరబడి వివిధ రకాలచెట్లను నరికివేశారు. నరికివేసిన చెట్ల ఆనవాళ్లు గుర్తుతెలియకుండా వాటికి నిప్పుపెట్టి తగుల బెట్టారు. అదే సమయంలో అడవిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది గమనించి నిప్పును ఆర్పివేశారు. కాగా గతేడాది శ్రీను, మొగులయ్యలు అక్రమంగా ఒక ఎకరా అటవీభూమిని కబ్జా చేసి కందిపంటను సాగుచేశారని అటవీ రేంజర్ తెలిపారు. అయితే వారు తాజాగా పక్కనే ఉన్న మరో ఎకరా భూమిలో చెట్లను నరికి తగులబెట్టి కబ్జాకు ప్రయత్నించారని, ఈ మేరకు అటవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జేసీబీ వచ్చేసింది!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన జేసీబీ ఎట్టకేలకు వచ్చేసింది. ఆర్నేళ్ల తర్వాత శనివారం ఉదయం మున్సిపాలిటీకి జేసీబీ చేరుకుంది. ఆంధ్రజ్యోతిలో జేసీబీపై వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాలతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గతంలో ఆరా తీస్తూ జేసీబీ తెప్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను జేసీబీ ఎక్కడ ఉందని, వెంటనే తెప్పించాలని ఒత్తిడి చేశారు. దీంతో కమిషనర్ విక్రం సింహారెడ్డి ఇంజనీర్ విభాగానికి చెందిన డీఈ, ఏఈలను ఆదేశిస్తూ వెంటనే జేసీబీకి సంబంధించిన బిల్లులు క్లియర్ చేస్తూ జేసీబీని తెప్పించాలని ఆదేశించారు. జేసీబీ మరమ్మతులకు హైదరాబాద్‌లోని వెంకట్‌సాయి మోటర్ ప్రైవేట్ లిమిటెడ్ మెకానిక్ షెడ్డుకు తీసుకెళ్లగా అక్కడ బిల్లులు చెల్లించక ఆర్నెళ్లుగా అక్కడే ఉందని తెలిపారు. జేసీబీ మరమ్మతులకు రూ.5లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఈ వివరాలను తెలిపేందుకు అధికారులు నిరాకరించారు. జేసీబీ తాండూరుకు రప్పించడంలో ఆంధ్రజ్యోతి కృషిఉందని కౌన్సిలర్ సంగీత ఠాకూర్, ముక్తార్ నాజ్, కౌన్సిలర్లు అభినందించారు.


తాండూరు మున్సిపాలిటీకి చేరిన జేసీబీ

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


వికారాబాద్: ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వికారాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అన్నారు. వికారాబాద్‌లోని అలోకా పాఠశాలలో రామానుజయన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సతీష్, ప్రిన్సిపల్ గీత జ్యోతి గణిత మేళాను సందర్శించారు.

పరిగి: స్థానిక జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గణితశాస్త్ర ప్రదర్శనను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెన్నె ఈశ్వరప్ప పాల్గొని విద్యార్థులకు విద్యార్థుల కోసం బ్లాక్‌బోర్డులు, వివిధ రకాల పుస్తకాలను ఈశ్వరప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరిత, సిద్దాంతి పార్థసారథి, పెంటయ్య పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య సమావేశం నిర్వహించారు. అదే విధంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో శనివారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు హైమద్, పార్వతి పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం మేడ్చల్ పట్టణంలోని న్యూలిటిల్ లిల్లి పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన పలు ప్రదర్శనలను చేపట్టారు. ప్రదర్శణల్లో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజుల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కీసర: గణిత దినోత్సవం సందర్భంగా రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ జీవిత విశేషాలను, ఆయన సాధించిన విజయాలను విద్యార్థులు నాటకం ద్వారా ప్రదర్శించి, దాని ప్రాముఖ్యతలు వివరించారు. అనంతరం విద్యార్థులకు గణితం, క్యూబిక్ క్యూబ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ పద్మజా బహుమతులు ప్రధానం చేశారు.

కీసర రూరల్: నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మంది విద్యార్థులు 100కు పైగా గణిత నమూనాలను ప్రదర్శించారు. గణిత రింగోళి, గణిత క్విజ్ పోటీలనూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, హెచ్‌ఎం రాములు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్పీ బాలుర హైస్కూల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రదర్శనలు, సైన్స్, గణితం చిత్రాలను వేసి రంగులతో నింపారు. హెచ్‌ఎం పాపిరెడ్డి ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారికి జన్య స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్య సంస్థ ప్రతినిధి రమణ పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని తూంకుంట, దేవరయాంజాల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అత్యంత ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. దేవరయాంజాల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో రామానుజన్ చిత్రపటానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరయాంజాల్‌లోని సెయింట్ మెరిస్ పాఠశాల్లో గణిత శాస్త్రవేత్త రామానుజం జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక, విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహించారు. వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త నరసింహారెడ్డి, హెచ్‌ఎం బాలేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శామీర్‌పేట లోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం వేణు ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో మ్యాథమెటిక్స్ మోడల్స్‌ను ప్రదర్శించారు.


ఘట్‌కేసర్: గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రతినిధులు, ఉపాధ్యాయులు

బ్యాంకర్ల పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు


ఎస్బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్ల పనితీరు సరిగా లేకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాయకులు ఎస్బీఐ బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకులో రైతులు, ఖాతాదారులు ఎదుర్కొంటున్న సమస్యలను మేనేజర్‌తో నిలదీశారు. ఖాతాదారులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినా సరైన సమయంలో చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. స్పందించిన మేనేజర్ రైతులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, సూర్యప్రకాశ్ గౌడ్, నాందర్‌పూర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్‌లో విద్యార్థుల సత్తా

తాండూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి సౌత్ జోన్ టి -20, అండర్ -14 క్రికెట్ టోర్నమెంట్‌లో తాండూరులోని సహార క్రికెట్ అకాడమి జట్టు సత్తాచాటింది. హోరాహోరీ పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. ఈనెల 17 నుంచి 20 వరకు హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో తాండూరు జట్టుకు చెందిన సాయివర్థిత్‌రెడ్డి 13 వికెట్లతో ఉత్తమ బోలర్‌గా కనవ్ పండిత్ 9డిస్మిజల్స్‌తో కీపర్, ఫీల్డర్‌గా నిలిచారు. వీరిని సహారా క్రికెట్ కోచ్ జగన్నాథ్‌రెడ్డి తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యాలు అభినందించారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

మేడ్చల్ టౌన్: యువకులు క్రీడల్లో రాణించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో శనివారం నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పాల్గొని విన్నింగ్ కప్‌ను విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రభుకర్, కమిషనర్ స్వామి నాయక్, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తాండూరు రూరల్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే భోజనం అందించాలని తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్ అన్నారు. ఆహారోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హైస్కూల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రశస్త యాప్‌ను ప్రవేశపెట్టి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తోందన్నారు. ఈ యాప్‌ను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వారివారి సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఇటీవల తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, పౌష్టికాహారంపై మండలంలోని కొత్లాపూర్, సిరిగిరిపేట్, కోటబాస్పల్లి పాఠశాలను సందర్శించారని, అక్కడ కొన్ని లోపాలు ఉన్నందున ప్రధానోపాధ్యాయులకు మరోమారు సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు చేశారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు వైద్యనాథ్, బాబ్యనాయక్, జెట్టూరు శ్రీనివాస్, లీలావతి, బాకారం జైపాల్‌రెడ్డి, కిష్టప్ప, అంబమ్మ తదితరులున్నారు. గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లీలావతి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిండ్రులు తయారు చేసిన పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, మాధురి, సుశీలాదేవి, రమాదేవి న్నారు.


తాండూరు రూరల్: మాట్లాడుతున్న వెంకటయ్య

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవో హరిలాల్ శనివారం సమావేశం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని బుర్రితండా పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని హుసేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులే స్వయంగా రకరకాల వంటకాలతో పాటు చిరుతిళ్లను తయారుచేసి ప్రదర్శించారు. హెచ్‌ఎం కాంత్రికుమార్ వంటలు ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. చిన్నారులు తయారు చేసిన వంటకాలను రుచి చూసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

పరిగి: విద్యార్థుల ఆరోగ్యం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని మిట్టకోడూరు పాఠశాల హెచ్‌ఎం ఉస్మాన్‌అలీ అన్నారు. పాఠశాలలో తల్లిదండ్రులతో శనివారం సమావేశమై ఆహార దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు,తల్లిదండ్రులతో తయారు చేయించిన పోషక ఆహార పదార్థాలను పాఠశాలలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

పూడూరు: మండల పరిధిలోని కడుమూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆహారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు ఆహార పదార్థాలను తయారు చేసి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ మంచన్ లక్ష్మి, హెచ్‌ఎం మధు, మోసెస్, ఖాజా మోహినుద్దీన్, శ్రీను, ఉపాధ్యాయులు అనూష హరీష్‌బాబు, దాత అనిల్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ ఫుడ్‌ఫెస్టివల్‌తో పాటు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చేసిన వంటకాలను ఆయన పరిశీలించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోని ఉనత్న శిఖరాలను అధిరోహించాలని అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ (పీబీఎల్) కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో గొప్పగా స్థిరపడాలి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు జీవితంగా గొప్ప స్థాయిలో స్థిరపడాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అదేవిధంగా కళాశాలలో నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్ అండ్ అవైర్‌నెస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనిలత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అతివేగంతో బైక్‌పై నుంచి కిందపడి ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్కపట్లకు చెందిన శీలం దుర్గప్రసాద్(27), తన స్నేహితుడు నాగవంశీలు పనినిమిత్తం శనివారం బైక్‌పై వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో కర్కపట్ల-అలియాబాద్ మార్గమధ్యలో హెచ్‌బీఎల్ బస్టాప్ సమీపంలో బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడి స్నేహితుడు నాగవంశీకి తీవ్రగాయ్యాలయ్యాయి. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు-బొలెరో ఢీకొని ఇద్దరికి గాయాలు

పరిగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కారు, బొలెరో వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చింతలచెరువు వద్ద జరిగింది. హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్తున్న కారు, బొంరాస్‌పేట్ నుంచి పరిగికి వస్తున్న బొలెరో వాహనం పరిగి మండలం చింతలచెరువు వద్ద ఢీకొన్నాయి. అయితే బొలెరో వాహనంలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వాహనాలు దెబ్బతిన్నాయి.

జ్వరం వచ్చిందని వెళ్తే బీపీ టాబ్లెట్ ఇచ్చారు

- చిన్నారికి సిరప్ ఇవ్వకుండా టాబ్లెట్లు ఇవ్వడంపై ఆగ్రహం

వికారాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్ లేకపోవడంతో చేతికి వచ్చిన టాబ్లెట్లను ఓ నర్సు అందించింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన తేజస్విని అనే నాలుగు సంవత్సరాల చిన్నారికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని రామయ్యగూడ పీహెచ్‌సీకి ఉదయం 11గంటల సమయంలో తీసుకొచ్చారు. అక్కడ సమయానికి డాక్టర్ లేక పోవడంతో ఆస్పత్రిలో ఉన్న ఓ నర్సు జ్వరం అనగానే అక్కడ చేతికి వచ్చిన టాబ్లెట్లను ఇచ్చింది. తీరా ఆ టాబ్లెట్లు ఏంటా అని చూస్తే బీపీ టాబ్లెట్లు కావడం, అయినా పిల్లలకు సిరప్ ఇవ్వాల్సిన చోట టాబ్లెట్లు ఇవ్వడంతో తల్లిదండ్రులు అప్రమత్తమయ్యారు. ఇదేంటని ప్రశ్నిస్తూ ఆస్పత్రి తీరుపై మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకట రవణను వివరణ కోరగా రామయ్యగూడ పీహెచ్‌సీలో టాబ్లెట్ ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చిందని, డాక్టర్ అందుబాటులో లేక పోవడంతో అక్కడ ఉన్న నర్సు టాబ్లెట్లను ఇచ్చిందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సుకు ఇప్పటికే మెమో అందించామని చెప్పారు. ఇక ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

మూడుచింతపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో గత మూడు నెలల వ్యవధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సెల్‌ఫోన్ చోరీలకు సంబంధించి 52ఫిర్యాదులు అందగా సీఈఐఆర్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి ప్రత్యేక బృందాలతో వాటిని రికవరీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు శనివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీఐ గంగాధర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కల్తీ మద్యం విక్రయాలు?

దోమ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర వైన్స్‌లో కల్తీమద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. బీరు బాటిళ్లలో పురుగులు వచ్చాయని ఓవ్యక్తి శనివారం వైన్స్ నిర్వాహకులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం ఇచ్చారని వాపోయాడు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

వికారాబాద్/దౌల్తాబాద్/దోమ/కులకచర్ల/కొడంగల్ రూరల్/మర్పల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లులేని పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తుందని 32వ వార్డు శివరాంనగర్ కౌన్సిలర్ నవీన్ అన్నారు. వార్డులో శనివారం ఇందిరమ్మ ఇంటింటి సర్వేను నిర్వహించారు. దౌల్తాబాద్ మండలంలోని నర్సాపూర్‌లో శనివారం ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. దోమ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. కులకచర్ల మండలంలోని పుట్టపహడ్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్‌లో పంచాయితీ కార్యదర్శి చైతన్యకుమార్ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. గ్రామంలో 512 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు. మర్పల్లి మండలంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్‌యాదవ్, రామేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు.

తాండూరులో సర్వర్ డౌన్

తాండూరు రూరల్: మండలంలోని ఉద్దండాపూర్, గుండ్లమడుగు తండా, ఓగీపూర్, పర్వతాపూర్, చెంగోల్ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే శనివారం కొనసాగింది. ఈ సర్వేలో సర్వర్ డౌన్ అవడంతో కార్యదర్శులు లబ్ధిదారుల సమగ్ర వివరాలను అప్‌లోడ్ చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ సరిగ్గా ఉండకపోవంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ఫక్రోజీ, సత్యనారాయణరెడ్డి, లాలప్ప, బాలకృష్ణ తదితరులు వాపోయారు. ఈ సర్వేను ఈనెల 31న పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రోజుకు 30కుటుంబాలు మాత్రమే సర్వే చేయగలుగుతున్నామని పలువురు కార్యదర్శులు పేర్కొన్నారు. పర్వతాపూర్‌లో నెట్‌వర్క్ రాకపోవడంతో లబ్ధిదారున్ని ఇంటిపైకి ఎక్కించి ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు.

టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు


అశోక్, జీహెచ్‌ఎం, ఘనాపూర్


యాదయ్య, జీహెచ్‌ఎం, మదన్‌పల్లి


దేవ్యా, జీహెచ్‌ఎం, ఆలంపల్లి

వికారాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర కార్యవర్గంలో నూతనంగా ముగ్గురికి చోటు దక్కింది. టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మర్పల్లి మండలం ఘనాపూర్ జడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.అశోక్, వికారాబాద్ మండలం, మదన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం వి.యాదయ్యలు నియమించారు. అదేవిధంగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధి ఆలంపల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎల్.దేవ్యాను, టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకాలను ఖరారు చేస్తూ టీఎస్‌జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, ప్రధానకార్యదర్శి కె.రాంరెడ్డి శనివారం ప్రకటన చేశారు. టీఎస్‌జీహెచ్‌ఎంఏ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన అశోక్, యాదయ్య, దేవ్యాలకు అవకాశం కల్పించినందుకు వారు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్‌లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

సంక్షిప్తంగా..

కందుల ధరలు పతనం

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో గత వారం కన్నా ఈవారం కందుల ధరలు పతనమయ్యాయి. శనివారం సాయంత్రం మార్కెట్‌లో నిర్వహించిన బీట్లలో కందుల ధరలను తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారం కందులు క్వింటాలుకు రూ.9,460 నుంచి రూ.9,501 వరకు ధర పలికింది. ఈ వారం క్వింటాలుకు రూ.7,300ల నుంచి రూ.7,775ల వరకు పలికింది. గరిష్టంగా రూ.2,160 వరకు ధరలు పడిపోయాయి.

అన్ని వార్డులకు సీసీ రోడ్లు

మేడ్చల్ టౌన్: మున్సిపల్ పరిధిలోని గిర్మాపూర్‌లో శనివారం మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి రూ.17లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆమె స్థానిక కౌన్సిలర్ లావణ్య హనుమంత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

యాలాల: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో యాలాల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తుండగా, పోలీసులు దిష్టిబొమ్మను లాక్కున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంక్షేమ సంఘం మహేష్, వీవీపీఎస్ నాయకులు ప్రవీణ్, జోగు రమేష్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తాండూరు: కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కల్లూరి రాజశేఖర్‌కు వైద్యంనిమిత్తం తాండూరుకు చెందిన దొరిశెట్టి సత్యమూర్తి శనివారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

దొంగలతో అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్: సెల్‌ఫోన్ దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై పుండరీకం అన్నారు. మండలకేంద్రంలో శనివారం సంతలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, +922330268518 నెంబరు నుంచి వచ్చే కాల్స్ లిఫ్ట్ చేయరాదన్నారు. ఫోన్‌పేలో డబ్బులు వేసినట్లుగా చూయించి మోసం చేస్తున్నారని, మేకల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

బషీరాబాద్: గతేడాది పలు పథకాల కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను బషీరాబాద్ ఎంపీడీవో విజయ్ కుమార్ శనివారం స్వయంగా పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని బద్లాపూర్, జీవన్గి గ్రామాలను సందర్శించి మురుగుకాల్వలు, సీసీ రోడ్ల పనులను ఆయన కలియతిరిగి గుర్తించారు.

షీటీం అవగాహన సదస్సు

పూడూరు: అంగడిచిట్టెంపల్లి పాఠశాలలో షీటీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం షీటీం సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జీ నర్సింహులు సమక్షంలో విద్యార్థులకు నిర్భయ చట్టం, పోక్సో యాక్ట్, డయల్ 100పై అవగాహన కల్పించారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్: సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు తమను విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని గత ప్రభుత్వాన్ని, ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న పట్టించుకోవడం లేదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సెయింట్ జూడ్స్‌లో క్రిస్మస్ వేడుకలు

వికారాబాద్: క్రిస్టమస్ అంటే ప్రేమ, శాంతి, సంతోషానికి ప్రతీక అని సెయింట్ జూడ్స్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఫరీద్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శనివారం కళాశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రీస్తుకు సంబంధించిన నాటకాన్ని ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని తలిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం అనమ్మ, జెస్సి జోసెఫ్, అధ్యాపక బృందం సుధా, అనంతయ్య, లత, ప్రియాంక, నవనీత పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి జాతర

మర్పల్లి: పిల్లిగుండలో మల్లన్న స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. మూడు రోజుల జాతరలో భాగంగా శనివారం మొదటి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నస్వామికి ప్రతీ ఇంటి నుంచి నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం ఆలయం దగ్గర అన్నదానం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

జుంటుపల్లి సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

యాలాల: మండలంలోని జుంటుపల్లి సీతారామస్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, అగ్గనూరు వెంకట్‌లు ప్రత్యేక పూజలు చేశారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా కె.అంజిలప్ప

పెద్దేముల్: మండల రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షులుగా తట్టెపల్లి గ్రామానికి చెందిన కె.అంజిలప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాచయ్య, ప్రధానకార్యదర్శిగా పి.శ్రీనివాస్, నందు, సలహాదారులుగా వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. వీరిని తహసీల్దార్ సమక్షంలో సమక్షంలో డీలర్లు సన్మానించారు.